ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శుక్రవారం 8 మార్చి 2024




బెంగుళూరు రోడ్డులోని శివకోటి దేవాలయం


ధర్మాపురంలో ఆంజనేయులు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నారా భువనేశ్వరి

ఐదేళ్లుగా ప్రజలు అవస్థలు పడుతున్నారు

ఓటు ఆయుధంతో వైసీపీ ప్రభుత్వాన్ని కూల్చేయండి

ప్రజలకు నారా భువనేశ్వరి పిలుపు

గుత్తి మండలంలో నిజం గెలవాలి యాత్ర

తెలుగుతల్లినీ అమ్మేస్తాడు!

ఆస్తికోసం తల్లిని, చెల్లిని తరిమేశాడు

గుంతకల్లు/గుత్తి రూరల్, మార్చి 7: వైసీపీ అధికారంలోకి వచ్చాక విలువలు క్షీణించాయని, మరోసారి జగన్‌కు అధికారం ఇస్తే తెలుగుతల్లిని అమ్మేస్తారని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపైనే కాదు రాష్ట్ర ప్రజలందరిపై జగన్ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా రెండోరోజు గురువారం గుత్తి మండలంలో ఆమె పర్యటించారు. పామిడి సమీపంలో జాతీయ రహదారి వద్ద భువనేశ్వరికి మహిళలు హారతి పట్టారు. పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి గుత్తి బైపాస్ మీదుగా ఆమె ధర్మాపురం చేరుకున్నారు. చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టు చేయడంతో మనస్తాపం చెంది మరణించిన వార్డు మెంబరు ఎం.ఆంజనేయులు ఇంటికి వెళ్లారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కూతుళ్లు, కుమారులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం బేతాపల్లికి వెళ్లి, మృతిచెందిన కార్యకర్త జయమ్మ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.3 లక్షలు చొప్పున ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు.

దౌర్జన్యాలు పెరిగాయి..

ధర్మాపురం, బేతాపల్లి గ్రామాల ప్రజలతో భువనేశ్వరి మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో దౌర్జన్యాలు, అరాచకాలు పెరిగాయని అన్నారు. ఐదేళ్లలో జగన్ చెడు మాత్రమే చేశారని, ప్రజలకు అదే నేర్పుతున్నారని విమర్శించారు. 'మనం ఇప్పుడుంటాం. రేపు ఉండకపోవచ్చు. కానీ నిలిచేది మంచితనమే' అని అన్నారు. చంద్రబాబు సహా తమ కుటుంబ సభ్యులు ఎన్నడూ చెడును దరిచేర్చలేదని, విలువలకు ఎన్టీఆర్ పెట్టింది పేరని అన్నారు. ఆయన నడిచిన మార్గంలో తాము నడుస్తున్నామని అన్నారు. జగన్ ప్రజల డబ్బును లూటీ చేశారని, డబ్బు తక్కువవచ్చి తల్లిని, చెల్లిని దగా చేశారని, ఇంట్లోంచి వారిని తరిమేశారని విమర్శించారు. తెలుగు తల్లిని కూడా అలాగే తరిమేస్తారని, లేదంటే అమ్మేస్తారని వ్యాఖ్యానించారు. అత్యుత్తమ పథకాలను ప్రవేశపెట్టి, ప్రజల కడుపు నింపిన నాయకుడు చంద్రబాబు అని, ప్రజల కడుపుకొట్టి, నోటికాడికూడు లాగేసుకున్నది జగన్ అని విమర్శించారు. మహిళల అభ్యున్నతికి చంద్రబాబు పాటుపడుతున్నారని అన్నారు. డ్వాక్రాకు ఆద్యుడు చంద్రబాబు అని అన్నారు. మహిళలు ఇతరులపై ఆధారపడకుండా తమ కాళ్లపై నిలబడేలా చేయడానికి ఇప్పుడు మాహాశక్తి అనే బృహత్ పథకానికి రూపకల్పన చేశారని అన్నారు. మరో నెలలో కురుక్షేత్ర సంగ్రామం జరుగుతుందని, ఓటు అయుధంతో వైసీపీ ప్రభుత్వాన్ని కూల్చాలని పిలుపునిచ్చారు. పొరుగువారి చేత కూడా టీడీపీకి ఓటు వేయించి, రాష్ట్రానికి పట్టిన పీడను వదిలించాలని అన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవడమే కర్తవ్యంగా, బిడ్డల భవిష్యత్తును కాపాడుకోవడమే ధ్యేయంగా ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని సూచించారు. అన్యాయాన్ని నిలువరించి, న్యాయం గెలిచేలా ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని అన్నారు.

ఉష్ణోగ్రతలు	(7-3-2024)
గరిష్ఠం	39.0
కనిష్ఠం	24.0


జయమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తూ...


ఆంజనేయులు కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తూ..


బేతాపల్లిలో జయమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న భువనేశ్వరి

తరలివచ్చిన నాయకులు

నిజం గెలవాలి కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్, గుంతకల్లు పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు పవన్ కుమార్ గౌడు, ధర్మతేజ్ గౌడు, అనిల్ కుమార్ గౌడు, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, తలారి సరోజమ్మ, పత్తి హిమబిందు, హనుమంతు, టి.కేశప్ప, ఆటో ఖాజా, ఫ్రూట్ మస్తాన్, బండి లక్ష్మీదేవి, అంజలి, గుత్తి నాయకులు బర్దీవలి, భరత్ కుమార్, ధనుంజయ, శ్రీనివాస్ చౌదరి, వెంకట రాముడు, ఎంకే చౌదరి, కేశవ నాయుడు, శ్రీకాంత్ చౌదరి, దిల్కా శీనా, సుధాకర్ నాయుడు, పామిడి నాయకులు గుర్రం సుమిత్రమ్మ, రామాంజనేయులు నాయక్, అప్పన్నగారి కుమార్, మహమ్మద్ రఫీ, టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, వడ్డే శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓం.. శివోహం..!

నేడు మహా శివరాత్రి
పూజలు, జాగరణకు ఏర్పాట్లు

అనంతపురం కల్చరల్, మార్చి 7: మహా శివరాత్రి నేపథ్యంలో శుక్రవారం ముక్కంటిని భక్తిశ్రద్ధలతో పూజించేందుకు హిందువులు ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రతి నెలా తిథులమేరకు వచ్చే శివరాత్రిని మాస శివరాత్రిగా పేర్కొంటారు. కానీ మాఘమాసంలో వచ్చే శివరాత్రిని మహాశివరాత్రిగా అభివర్ణిస్తారు. ఆ రోజున శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించుకుంటారు. మహా శివుడు సాకారమైన మూర్తిగాను, నిరాకారమైన లింగంగానూ పూజలందుకుంటాడు. స్వామివారి దర్శనానికి జిల్లాలోని శివాలయాలకు భక్తులు పోటెత్తుతారు. అందుకు అనుగుణంగా ఆలయాల వద్ద ఏర్పాట్లు చేశారు. అనంతపురం నగరంలోని శివకోటి ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఈ నెల 1వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ శుక్రవారం వేకువజాము నుంచే కాశీవిశ్వేశ్వరునికి రుద్రాభిషేకాలు, యామపూజలు నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం శివపార్వతుల కళ్యాణోత్సవం నిర్వహిస్తారు. నంది వాహనంపై నగర వీధుల్లో ఊరేగిస్తారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణమండపంలో శుక్రవారం సాయంత్రం 5 నుంచి శనివారం తెల్లవారుజాము 5 గంటల వరకు జాగరణ నిర్వహిస్తారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆహార భద్రత

● ఈజిప్ట్, యూరప్ దేశాల ప్రతినిధి బృందాల ప్రశంస


చీనీ పంటను పరిశీలిస్తున్న ఈజిప్ట్, యూరప్ దేశాల ప్రతినిధులు

పామిడి, మార్చి 7: ప్రకృతి వ్యవసాయంతోనే ఆహార భద్రత, పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఈజిప్ట్, యూరప్ ప్రతినిధుల బృందం పేర్కొంది. ఎద్దులపల్లిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతులు శ్రీనివాసరెడ్డి, వెంకట్రామిరెడ్డి సాగుచేస్తున్న పంటలను గురువారం వారు పరిశీలించారు. శ్రీనివాసరెడ్డి ఒకటిన్నర ఎకరాలో చీనీ, నిమ్మ, మునగ సాగు చేసి లాభాలను గడిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే బయో డైవర్సిటీని ప్రోత్సహిస్తున్నారు. రసాయన విధానంలో సాగుచేస్తున్న మరో రైతు వెంకటరామిరెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని కూడా విదేశీ బృందం సందర్శించింది. సాగు విధానాలను పరిశీలించి, రైతులను అభినందించింది.

దొడ్డిదారి బదిలీలు..?

డీఈఓ కార్యాలయానికి సీల్డ్ కవర్

వైసీపీ అనుకూల ఉపాధ్యాయులతో జాబితా
పండుగ తరువాత మరో సీల్డ్ కవర్
ఆ వెంటనే బదిలీల ఉత్తర్వులు..?



అనంతపురం విద్య, మార్చి 7: ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అధికార పార్టీ అడ్డగోలు బదిలీలకు పూనుకుంది. అవసరం లేకున్నా, తమతో అంటకాగుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, భారీగా ముడుపులు ఇచ్చిన ఉపాధ్యాయులను బదిలీ చేయించాలని చూస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ ఏ క్షణమైనా రావచ్చు. మరో నెలన్నరలో విద్యా సంవత్సరం ముగుస్తుంది. ఇలాంటి సమయంలో ఉపాధ్యాయులను బదిలీ చేయాలని హై రెకమెండేషన్ సీల్డ్ కవర్ ఇటీవల జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి చేరింది. శివరాత్రి పండుగ తర్వాత 2వ సీల్డ్ కవర్ కూడా వస్తుందని విశ్వసనీయంగా తెలిసింది. సోమ లేదా మంగళవారం రెండో సీల్డ్ కవర్ వస్తుందని, ఆ వెంటనే రెండు కవర్లు ఓపెన్ చేసి ఉత్తర్వులను అమలు చేయాలని రాష్ట్రస్థాయి నుంచి ఆదేశాలు వచ్చినట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. దీనిపై సీనియర్ ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

అవసరం లేకున్నా...

విద్యా సంవత్సరం చివరి దశకు చేరింది. మరో నెలన్నరలో ముగుస్తుంది. ఇప్పుడు ఉపాధ్యాయ బదిలీలు చేయాల్సిన పని లేదు. అయినా, వైసీపీ సర్కారు తమ పార్టీకి అనుబంధంగా ఉండే వైఎస్ఆర్ టీఎఫ్ నాయకులకు, వారి వెంట నడిచే నాయకులకు, భజన చేసే ఉపాధ్యాయులకు, లక్షలాది రూపాయలు ముడుపులు ఇచ్చేవారికి బదిలీల ద్వారా లబ్ధి చేయాలని చూస్తోంది. అడ్డగోలు బదిలీలతో ఎన్నికల వేళ లబ్ధి పొందాలని చూస్తోంది. ఇటీవల 70 నుంచి 80 మంది ఉపాధ్యాయుల అడ్డగోలు బదిలీలు చేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ నుంచి రిమార్క్స్ అడిగినట్లు తెలుస్తోంది. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారులు ఖాళీల సమాచారాన్ని పైవారికి అందజేసినట్లు తెలుస్తోంది. ఆ వెంటనే సిఫార్సు బదిలీల సీల్డ్ కవర్ డీఈఓ ఆఫీస్‌కు వచ్చింది. ఇప్పటి వరకూ దాన్ని ఓపెన్ చేయలేదని డీఈఓ ఆఫీస్ సిబ్బంది చెబుతున్నారు. వైసీపీకి అనుకూలంగా ఉండే ఇద్దరు ఉపాధ్యాయుల పేర్లు కూడా అందులో ఉన్నట్లు సమాచారం. సిఫార్సు బదిలీల జాబితా చాలానే ఉన్నా, 20 మందికి మాత్రమే సరిపడా ఖాళీలు ఉన్నట్లు తెలుస్తోంది.

పండుగ తర్వాత..

శివరాత్రి తర్వాత రెండో సీల్డ్ కవర్ వస్తుందని సమాచారం. ఇటీవలే మరికొందరు టీచర్ల బదిలీలకు అవసరమైన రిమార్క్స్‌ను రాష్ట్ర శాఖ నుంచి అడిగినట్లు సమాచారం. రిమార్క్స్ వివరాలను రెండు రోజుల కిందట డీఈఓ ఆఫీస్ అధికారులు స్టేట్ ఆఫీస్‌కు అందజేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం లేదా మంగళవారంపై నుంచి జిల్లాకు జాబితా వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. రెండో కవర్ రాగానే రెండింటినీ తెరిచి.. బదిలీ ఉత్తర్వులు ఇవ్వాలని రాష్ట్రస్థాయి నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. వీటిలో సుమారు 7 నుంచి 8 వరకూ బదిలీలు చేయడానికి ఆస్కారం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో అడ్డదారిలో సిఫార్సు బదిలీలకు వైసీపీ సర్కార్ పూనుకోవడంపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి

జిల్లా వ్యాప్తంగా పెరిగిన పోలింగ్ కేంద్రాలు.. అదనపు ఓటర్లు ఉన్నచోట సహాయక కేంద్రాలు

అనంతపురం టౌన్, మార్చి 7: ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లను పూర్తి చేస్తోంది. సిబ్బంది నియామకం, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, వసతులు కల్పన తదితరాలను కలెక్టరు గౌతమి, జేసీ కేతన్ గార్గ్, డీఆర్వో రామకృష్ణా రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కసరత్తు పూర్తి అయింది.


తాడిపత్రిలో పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టరు గౌతమి(ఫైల్)

పెరిగిన కేంద్రాలు

2019 ఎన్నికలతో పోలిస్తే.. జిల్లాలో పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరిగింది. అప్పట్లో 2,193 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం ఈ సంఖ్య 2,213కు చేరింది. కొత్తగా 15 పోలింగ్ కేంద్రాలను నాలుగు నియోజకవర్గాలలో ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో అనంతపురం అర్బన్‌లో అత్యధికంగా 9 కేంద్రాలు ఉన్నాయి. రాయదుర్గంలో 3, శింగనమలలో రెండు, తాడిపత్రిలో ఒక కేంద్రం కొత్తగా ఏర్పాటు అవుతున్నాయి. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ తర్వాత జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలలో మొత్తం 2,213 కేంద్రాలు ఉంటాయి. ఇందులో రాయదుర్గం నియోజకవర్గంలో 296, ఉరవకొండలో 259, గుంతకల్లులో 276, తాడిపత్రిలో 272, శింగనమలలో 293, అనంతపురం అర్బన్‌లో 277, కళ్యాణదుర్గంలో 261, రాప్తాడులో 279 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

సహాయక కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో పోలింగ్ కేంద్రాలలో మార్పులు జరిగాయి. నాలుగు కేంద్రాలను ఒకచోటు నుంచి మరోచోటుకు మార్చారు. మరో 85 చోట్ల పోలింగ్ కేంద్రాల పేర్లను మార్చారు. ఓటర్ల సంఖ్యను బట్టి సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలలో పరిమితికి మించి.. 1450 నుంచి 1500 మంది ఓటర్లు అదనంగా ఉంటే.. అక్కడ సహాయక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉరవకొండ నియోజకవర్గంలో 4, తాడిపత్రిలో 2, అనంతపురం అర్బన్‌లో 15, రాప్తాడులో రెండు సహాయ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆమోదం కోసం కలెక్టర్ గౌతమి ప్రతిపాదనలను పంపించారు.

గుమ్మనూరుకు టిక్కెట్ ఇస్తే ఓడిస్తాం

టీడీపీ నాయకులు, కార్యకర్తల హెచ్చరిక


గుత్తిలో నిరసనర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీనాయకులు

గుత్తి, మార్చి 7: మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకు టిక్కెట్ ఇస్తే ఓడిస్తామని టీడీపీ శ్రేణులు హెచ్చరించాయి. ఈ సందర్భంగా పట్టణంలో నాయకులు నిరసన ర్యాలీ చేపట్టారు. పట్టణంలో గుంతకల్లు, గుత్తి, పామిడికి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి రాజీవ్‌సర్కిల్ మీదుగా గాంధీ సర్కిల్ చేరుకుని నిరసన చేపట్టారు. గుమ్మనూరు జయరాం మాకొద్దు, జితేంద్ర గౌడ్ ముద్దు అంటూ నినాదాలతో హోరెత్తించారు. వారు మాట్లాడుతూ 11వ తేదీన గుంతకల్లులో జరిగే శంఖారావం సభలో టీడీపీ అభ్యర్థిగా జితేంద్రగౌడ్‌ను ప్రకటించాలని లేని పక్షంలో సభను బహిష్కరిస్తామన్నారు. టీడీపీ పట్టణ, మండల కన్వీనర్లు రవిశంకర్‌గౌడ్, బద్రివలి, దిల్కాశీనా, అబ్దుల్ జిలాన్, శ్రీనివాసయాదవ్, గుమ్మనూర్ వెంకటేష్, కేశప్ప, రాయలరామయ్య, గౌసపీరా, లక్ష్మీనారాయణరెడ్డి, నారాయణరావు, శ్రీకాంత్‌చౌదరి, గోవర్ధన్, నరసింహులు పాల్గొన్నారు.

శంఖారావం ఏర్పాట్ల పరిశీలన



సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న పల్లె

కొత్తచెరువు, మార్చి 7: మండల కేంద్రంలోని ధర్మవరం రోడ్డులో శంఖారావం సభా వేదిక ఏర్పాట్లను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి గురువారం పరిశీలించారు. బహిరంగసభకు వచ్చేవారికి ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని ఏర్పాట్లను ఆయన దగ్గరుండి పూర్తి చేయించారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గల టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. వచ్చే వారికి భోజన సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పల్లె వెంట నాయకులు రామాంజనేయులు, సోమశేఖర్, ఒలిపిశీన, సాలక్కగారిశ్రీనివాసులు, సయ్యద్, మనోహర్, ఊరువాకిలి సురేశ్‌నాయుడు, హరి, ఎల్ఐసీ నరసింహులు ఉన్నారు.

శంఖారావం సభకు తరలిరండి: కందికుంట

కదిరి, మార్చి 7: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శుక్రవారం చేపట్టిన శంఖారావం సభకు కదిరి నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులందరూ తరలిరావాలని నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ గురువారం ప్రకటనలో పిలుపునిచ్చారు. పట్టణంలోని మదనపల్లిరోడ్డులో గల దేవరపల్లి సమీపం.. కొత్త బైపాస్ రోడ్డు వద్ద ఉదయం 11గంటలకు శంఖారావం సభ జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని కోరారు.

విజయవంతం చేయండి

పుట్టపర్తి రూరల్, మార్చి 7: టీడీపీ జాతీయ కార్యదర్శి నారాలోకేశ్ చేపట్టిన శంఖారావం సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పిలుపు నిచ్చారు. పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొత్తచెరువులోని ధర్మవరం రోడ్డులో ఈ శంఖారావం సభ జరగనుందన్నారు. నియోజకవర్గం లోని తెలుగుదేశం, జనసేన పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇంటర్ పరీక్షకు 326 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 7: జిల్లావ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. గురువారం ద్వితీయ సంవత్సరం సివిక్స్-2, బోటనీ-2, గణితం-2ఏ పరీక్షలు జరిగాయని ఆర్ఐఓ సురేశ్‌బాబు తెలిపారు. 41 కేంద్రాలలో 9,432 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 326 మంది గైర్హాజరయ్యారన్నారు. 9106 మంది పరీక్షలు రాశారని ఆయన చెప్పారు.

చేయూత నిధులు విడుదల

పుట్టపర్తి, మార్చి 7: చేయూత కింద జిల్లాలో 1,12,482మంది లబ్ధిదారులకు రూ.210కోట్ల నిధులు విడుదల చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం ఇందుకు సంబంధించిన మెగా చెక్కును ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల ఖాతాల్లో నిధులు జమచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, ఎంపీపీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి బాటలు వేసింది చంద్రబాబే

భవిష్యత్తు గ్యారెంటీలో పరిటాల జ్ఞాన



23వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న పరిటాల జ్ఞాన తదితరులు

ధర్మవరం, మార్చి 7: మహిళల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ సతీమణి పరిటాల జ్ఞాన పేర్కొన్నారు. పట్టణంలోని 23వ వార్డులో గురువారం ఆమె బాబుష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతింటికీ వెళ్లి ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం మహిళలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. ముఖ్యంగా డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చి మహిళల అభ్యున్నతికి బాటలు వేసింది చంద్రబాబేనన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలంటే టీడీపీనే సాధ్యమన్నారు. కనుక వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ధర్మవరం నియోజకవర్గంలో పరిటాల శ్రీరామ్ అన్ని వర్గాల ప్రజలకు చేరవయ్యారని, ఆయన ఇక్కడ ఎమ్మెల్యే కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఫణికుమార్, అడ్రామహేశ్, నాగూర్‌హుస్సేన్, వెంకటేశ్, పురుషోత్తంగౌడ్, కేశగాళ్లశీన, రాంపురంశీన, గంగారపురవి, గడ్డంకుళ్లాయప్ప, కత్తులబాబ్జీ, చీమలనాగరాజు, అంకేదుర్గేశ్, తోట నారాయణస్వామి, అశోక్, బత్తలగంగాధర్, ముతుకూరుబీబీ, మాదనమహేశ్వరి, కత్తులసునీత, స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

25వ వార్డులో ముమ్మర ప్రచారం

కదిరి, మార్చి 7: పట్టణంలోని 25 వార్డులో గురువారం కందికుంట వెంకట ప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ ముమ్మర ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి సీఎంగా చంద్రబాబును, ఎమ్మెల్యేగా కందికంట వెంకటప్రసాద్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. మినీమేనిఫెస్టో పథకాలను వివరించారు. ప్రతి ఇంటివద్ద ఆమెకు ఘన స్వాగతం లభించింది. కార్యక్రమంలో నాయకులు పర్వీనాబాను, డైమండ్ ఇర్షాన్, ఖాదర్‌బాషా, ఇదాయత్, కౌన్సిలర్ అల్తాముస్తఫా, బాబున్ను, మున్నా, అయూబ్, కతాబ్, ఇలియాజ్, దాదాపీర్, ఏజేసు, అల్తాం, సలాం, ఇస్మాయిల్, ఫారూక్, నాసిర్ అలీ, అతిక్, మన్సూర్, పవన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇక మండే ఎండలు

బుక్కరాయసముద్రం, మార్చి 7: ఉమ్మడి జిల్లాలో రానున్న రోజుల్లో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి గురువారం తెలిపారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39.7 నుంచి 40.7 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.9 - 24.7 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆగ్నేయం దిశగా గాలులు గంటలకు 3 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందని అన్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులు నేల పరిస్థితుల ఆధారంగా తరచూ పంటలకు నీటి తడులు ఇవ్వాలని సూచించారు. వేసవిలో పశుగ్రాసం కొరతను అధిగమించడానికి మొక్కజొన్న జొన్న, ఇతర పప్పు పంటల నుంచి సైలేజ్‌ను తయారు చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెస్సీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మార్చి 7: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెస్సీ పరీక్షల ఫలితాలను విడుదల చేశామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఫిబ్రవరిలో ఎమ్మెస్సీ ప్రథమ, తృతీయ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఫలితాల కోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని విద్యార్థులకు సూచించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పుట్టపర్తి, మార్చి 7 : పట్టణంలోని ప్రశాంతి నిలయంలో గల సాయి కుల్వంత్ హాల్లో భక్తులు చేపట్టిన సంగీత కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గురువారం సాయంత్రం ప్రశాంతి డ్యాన్స్‌గ్రూపు సత్యం.. శివం.. సుందరం పేరిట సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా శుక్రవారం అఖండ భజన నిర్వహించనున్నారు.

పుణ్యభూమి అనంత



లోకేశ్ అభివాదం

మడకశిర సభకు హాజరైన జనం



సూపర్ సిక్స్ పథకాల బ్యాగును మడకశిరఅభ్యర్థి సునీల్‌కుమార్‌కు అందజేస్తున్న లోకేశ్



హిందూపురంలో యువతతో కరచాలనం



విజయ సంకేతం చూపుతున్న మహిళ

చంద్రబాబు, లోకేశ్ ఉన్న జెండాతో యువత సందడి

తప్పుచేస్తే పాతరేస్తారు..

- మా కుటుంబాన్ని ఆదరించింది ఇక్కడే
- టీడీపీ కంచుకోట అంటే గుర్తొచ్చేది హిందూపురమే..
- రూ.2 వేల కోట్లతో పురాన్ని మామ అభివృద్ధి చేశాడు
- లేపాక్షి ఉత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహించాం
- అధికారంలోకి రాగానే జిల్లాలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్
- జనసంద్రం నడుమ శంఖారావం సభలు
- తరలివచ్చిన టీడీపీ, జనసేన శ్రేణులు

హిందూపురం, మార్చి 7: అనంత జిల్లా పుణ్యభూమి అనీ, ఇక్కడ ఎవరైనా తప్పు చేస్తే పాతరేస్తారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పేర్కొన్నారు. జిల్లాలో ప్రసిద్ధిచెందిన లేపాక్షి ఆలయం, తిమమ్మ మర్రిమాను ఉన్నాయన్నారు. సత్యసాయిబాబా నడయాడిన నేల అన్నారు. ఇక్కడికి రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. శంఖారావం యాత్రలో భాగంగా ఆయన గురువారం జిల్లాలో పర్యటించారు. హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన సభల్లో పాల్గొన్నారు. హిందూపురం పట్టణ పరిధిలోని కొట్నూరు ఇందిరమ్మ కాలనీ వద్ద శంఖారావం సభలో నారా లోకేశ్ ప్రసంగిస్తూ.. టీడీపీ అంటే గుర్తుకొచ్చేది హిందూపురమేననీ, ఇక్కడి ప్రజలు తమ కుటుంబాన్ని ఆదరిస్తున్నారన్నారు. వారి రుణం ఎలా తీర్చుకోవాలని ఆలోచిస్తున్నామన్నారు. ఎన్టీఆర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పంపిన ఘనత హిందూపురానికే దక్కుతుందన్నారు. మామయ్యలు హరికృష్ణ, బాలకృష్ణను నాలుగుసార్లు శాసనసభకు పంపారన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పైపులైను ద్వారా పట్టణానికి నీళ్లిచ్చిన ఘనత మామయ్య బాలకృష్ణదేనన్నారు. సీసీ రోడ్లు, ఆసుపత్రిలో మాతాశిశు కేంద్రం నిర్మాణం, పాడిపరిశ్రమలను ప్రోత్సహించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కొవిడ్ సమయంలో సొంత నిధులతో వెంటిలేటర్లు, మందులను పంపిణీ చేశారన్నారు. అన్న క్యాంటీన్ ద్వారా ఉచితంగా భోజనం, ఆరోగ్య రథం, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో పరీక్షలు, సంచార వైద్యం అందించారన్నారు. ఆఖరుకు బ్రాహ్మణి దగ్గర నుంచి పీఎఫ్‌ఆర్ ఫండ్స్ మొత్తం హిందూపురానికే ఖర్చు పెట్టించారన్నారు. భారీ మెజార్టీతో బాలయ్య మామను గెలిపించి, మూడోసారి అసెంబ్లీకి పంపాలని నియోజకవర్గ ప్రజలను కోరారు.

టీడీపీ హయాంలో జీడిపల్లి, పేరూరు ప్రాజెక్టులు ప్రారంభిస్తే జగన్‌రెడ్డి వాటికే మళ్లీ శిలాఫలకాలు ఏర్పాటు చేశారన్నారు. ఎక్కడ చూసినా శిలాఫలకాలు దిష్టిబొమ్మల్లా కనిపిస్తున్నాయన్నారు. వైసీపీ హామీ ఇచ్చిన జిల్లా కేంద్రం ఏర్పాటు, వైద్య కళాశాల ఎక్కడికెళ్లాయని ప్రశ్నించారు. వైసీపీ హిందూపురం నియోజకవర్గ నేతలు అక్రమ మద్యం వ్యాపారం, ఇసుకతో లూటీ చేస్తున్నారన్నారు. హిందూపురం నియోజకవర్గానికి ఏడాదికి ఒకరు చొప్పున వైసీపీ ఇన్‌చార్జిలు మారారన్నారు. ఇప్పుడున్న ఇన్‌చార్జి నంబర్ ఎంతో తెలీదంటూ ఎద్దేవా చేశారు.

మడకశిరను అభివృద్ధి చేశాం

మడకశిర: మారుమూల మడకశిర నియోజకవర్గాన్ని టీడీపీ హయాంలో ఎంతో అభివృద్ధి చేశామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని చీపులేటి వద్ద ఏర్పాటు చేసిన శంఖారావం సభలో ఆయన ప్రసంగించారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై వేలకోట్ల రూపాయలు వెచ్చించామన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న నాయకత్వంలో మడకశిర ప్రాంతంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేశామన్నారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు వేశామనీ, మూడు గురుకుల పాఠశాలలు నిర్మించామనీ, ఏకంగా ఇండోర్ స్టేడియం కట్టిన ఘనత తెలుగుదేశం పార్టీదే అన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం నిధులు కేటాయిస్తే.. వైసీపీ ప్రభుత్వం ఆ పనులను కూడా నిలిపి వేసిందన్నారు. వైసీపీ ఎమ్మెల్యే తిప్పేస్వామి అవినీతి గురించి చెప్పాలంటే రోజు మొత్తం సరిపోదన్నారు. రైతుల వద్ద తక్కువ ధరకు భూములు కొని, అధిక ధరకు విక్రయించి, సొమ్ము చేసుకున్నారన్నారు. అంగన్‌వాడీ పోస్టులు కూడా అమ్ముకున్నారని ఆరోపించారు. ఇసుక కూడా దోచుకున్నారన్నారు. రోడ్లు వేయాలంటే ఎమ్మెల్యేకు కప్పం కట్టాల్సిన పరిస్థితి ఉందనీ, క్వారీలను కూడా వదిలిపెట్టడం లేదన్నారు. అవినీతి ఫుల్ అభివృద్ధి నిల్... అన్నట్లు సాగుతోందన్నారు. ఎమ్మెల్యేకు వసూల్ రాజా అని పేరు పెడదామన్నారు. నియోజకవర్గానికి పాదయాత్రలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను గాలికొదిలేశారన్నారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే నియోజకవర్గంలో వక్క మార్కెట్ ఏర్పాటు చేసే బాధ్యత తీసుకొంటానన్నారు. పిల్లకాలువల ద్వారా సాగునీరు అందిస్తామనీ, పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత తానే తీసుకొంటానని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న గురుకుల పాఠశాలలు, ప్రాజెక్టులను పూర్తి చేస్తామనీ, పట్టురైతులకు సబ్సిడీ పునరుద్ధరిస్తామన్నారు. భారీ మెజార్టీతో సునీల్‌కుమార్‌ను గెలిపించి, అసెంబ్లీకి పంపింపాలని నాయకులు, కార్యకర్తలను కోరారు.

శంఖారావం సభల్లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, జనసేన నేత టీసీ వరుణ్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, మడకశిర మాజీ ఎమ్మెల్యే ఈరన్న, టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి సునీల్‌కుమార్, పెనుకొండ అభ్యర్థి సవిత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లకుంట అంజినప్ప, పెద్దఎత్తున టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరిన్ని పరిశ్రమలు తీసుకొస్తాం

పెనుకొండ టౌన్: టీడీపీ అధికారంలోకి రాగానే పెనుకొండ ప్రాంతానికి మరిన్ని పరిశ్రమలు తీసుకొస్తామని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. పట్టణ పరిధిలో గురువారం నిర్వహించిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ.. మరిన్ని పరిశ్రమలు తీసుకొచ్చి, నిరుద్యోగ సమస్యను రూపుమాపుతామన్నారు. పెనుకొండను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ పెండింగ్ పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. అధికార పార్టీకి చెందిన పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ అవినీతి అనకొండ అని లోకేశ్ ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే అన్నదమ్ములు నియోజకవర్గాన్ని కేక్‌లా కట్‌చేసి, అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. కియ అనుబంధ సంస్థల యాజమాన్యాలను బెదిరించి, మామూళ్లు అడగడంతో వెనక్కి వెళ్లాయన్నారు. లేబర్ కాంట్రాక్టు తీసుకుని, సకాలంలో జీతాలు కూడా చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. లేఔట్ వేయాలన్నా, సెంటు భూమికి పట్టా కావాలన్నా కమీషన్ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అక్రమాలు హెచ్చుమీరడంతో ఈ అనకొండను పక్క నియోజకవర్గానికి తరిమారన్నారు. మరో అనకొండ పెనుకొండకు వైసీపీ సమన్వయకర్తగా వచ్చారన్నారు. చెత్త ఎక్కడ వేసినా చెత్తేకదా అంటూ ఎద్దేవా చేశారు. టీడీపీ హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. కియ, అనుబంధ పరిశ్రమల ఏర్పాటుతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. అభివృద్ధి కావాలంటే నియోజకవర్గ ప్రజలు టీడీపీని ఆదరించాలని ఆయన కోరారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి సవితను గెలిపించి, శాసనసభకు పంపాలని నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు.

రాబోయే ఎన్నికలు యుద్ధం లాంటివి



రాబోయే ఎన్నికలు యుద్ధం లాంటివి. కార్యకర్తలు సర్వశక్తులు వడ్డాల్సిన అవసరం ఉంది. చంద్రబాబును సీఎం చేసుకునేందుకు కార్యకర్తలంతా సిద్ధంకావాలి. రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించడానికి సైనికుల్లా ముందుకెళ్లాలి. కరువుతో అల్లాడుతున్న జిల్లాకు తాగు, సాగునీరు అందించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు నిర్మించాం. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు నాశనం చేశారు. ఎమ్మెల్యే శంకర్‌నారాయణ నాపై, కార్యకర్తలపై ఎన్నో తప్పుడు కేసులు పెట్టి, వేధించాడు. కనీసం 5 కిలోమీటర్లు కూడా రోడ్డు వేయలేకపోయారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. పార్టీని ఆదరించాలి. చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

- బీకే పార్థసారథి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

నీరు రావాలన్నా... ఉద్యోగాలు రావాలన్నా.. చంద్రబాబు సీఎం కావాలి



రాబోయే ఎన్నికల నీతికి, అవినీతికి మధ్య సాగే యుద్ధం. టీడీపీ హయాంలో రూ.1350 కోట్లతో మడకశిర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు. మడకశిరకు నీరు రావాలన్నా.. ఇక్కడి యువతకు ఉద్యోగాలు కావాలన్నా చంద్రబాబునాయుడు సీఎం కావాలి. ఈ ప్రాంతం నుంచి చాలామంది కియ పరిశ్రమలో పనిచేస్తున్నారు. వారికి ఉపాధి కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. ఆయనకు మడకశిర నియోజకవర్గం తరఫున కృతజ్ఞతలు. అలాంటి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసేందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దాం. మడకశిరలో 30 వేల ఓట్ల మెజార్టీతో గెలిచి ఆయనకు కానుకగా అందిద్దాం.

- టీడీపీ-జనసేన ఉమ్మడి మడకశిర అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్

వైసీపీ అరాచకాలకు అదరం.. బెదరం



వైసీపీ అరాచకాలపై ఐదేళ్లుగా పోరాడుతున్నాం. అధికారులను అడ్డుపెట్టుకుని మాపై అక్రమ కేసులు పెట్టినా అదరం.. బెదరం. టీడీపీ జెండా పట్టుకునే ఉంటాం. కియ కార్ల పరిశ్రమ యాజమాన్యాన్ని బెదిరించడం మొదలు అనుబంధ పరిశ్రమలను భయభ్రాంతులకు లోను చేసి, దోచుకోవడానికి, దాచుకోవడానికే వైసీపీ వలస పక్షులు వచ్చాయి. ఓ వలస పక్షి ఎమ్మెల్యే శంకర్‌నారాయణ వచ్చి దోచుకెళ్లాడు. ఇప్పుడు మరో వలసపక్షి కళ్యాణదుర్గంలో డిపాజిట్లు రావని ఇక్కడికి వచ్చింది. అధికారులను అడ్డుపెట్టుకుని బెదిరింపులకు దిగుతోంది. ఈమెకూడా దోచుకోవడం తప్ప.. ఏ కాసింత అభివృద్ధి కూడా చేయదు. గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మించి, నీరిచ్చి, కియ పరిశ్రమను ఏర్పాటు చేయించిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుంది. రాబోయేది టీడీపీ ప్రభుత్వమే. పెనుకొండ రూపురేఖలు మారుస్తాం. భారీ మెజార్టీతో పెనుకొండను గెలిచి, చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇస్తాం.

- టీడీపీ-జనసేన ఉమ్మడి పెనుకొండ అభ్యర్థి సవిత

కన్నీటి కడలి..!





ప్రమాదస్థలంలో రోదిస్తున్న బంధువులు, రమీజా (ఫైల్)

తాడిమర్రి, మార్చి 7: ఇది కన్నీళ్లకే కన్నీళ్లు తెప్పించే ఓ ఇంటి కథ. కన్నీటి కడలిని తలపించే కష్టాల ప్రయాణం. ఏళ్ల క్రితమే ఇంటి పెద్దదిక్కు రోడ్డు ప్రమాదంలో గాయపడి, పనిచేయలేని స్థితిలో ఉన్నాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుక్కి బుద్ధిమాంద్యం. కూలికెళ్లి ఆ ఇల్లాలు.. భర్త, కుమారుడిని పోషించుకుంటోంది. ఈ కష్టాలు చాలవన్నట్లు 9 రోజుల క్రితమే కూతురి భర్త విద్యుదాఘాతంతో మరణించాడు. దీంతో కుమార్తె బాధ్యత ఆ ఇల్లాలిపై పడింది. చివరగా.. ఆ ఇంటికి ఆధారమైన ఆమె కూడా ప్రాణాలు కోల్పోయింది. భర్త, కుమారుడు, కుమార్తె రోడ్డునపడ్డారు. మండలంలోని చిల్లకొండయ్యపల్లి గ్రామానికి చెందిన పి.రమీజా(45) దుస్థితి ఇది. రమీజా భర్త ఫక్రుద్దీన్ గతంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి పనులకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నాడు. 26 ఏళ్ల వయసుగల కుమారుడు బాషా బుద్ధిమాంద్యంతో బాధపడుతున్నాడు. ఇద్దరు కుమార్తెలు ఉండగా.. వారికి వివాహాలు అయ్యాయి. కాగా పెద్ద కుమార్తె వన్నూరమ్మ భర్త 9 రోజుల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. దీంతో కుటుంబ భారమంతా రమీజాపై పడింది. పొలం పనులు చేస్తూ వచ్చిన కూలి డబ్బుతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న ఆమెను కూడా మృత్యువు వెంటాడింది. రమీజా గురువారం అదే గ్రామానికి చెందిన కూలీలతో కలిసి వేరుశనగ కట్టెను మిషన్‌లో ఆడించేందుకు వెళ్లింది. పెద్దకోట్ల గ్రామం వద్ద వేరుశనగ కట్టెను ఆడించారు. మధ్యాహ్నం భోజనం కోసం మిషన్‌ను ఆఫ్ చేసి, ఆ తరువాత ప్రారంభించారు. ఆ సమయంలో రమీజా తన బ్యాగును ఇంజన్ వద్ద ఉంచేందుకు వెళ్లగా.. ప్రమాదవశాత్తు చీర కొంగు.. మిషన్ రాడ్డుకు తగులుకుంది. రాడ్డుకు ఎలాంటి పరికరం అడ్డుగా లేకపోవడంతో రమీజాను లాగేసింది. దీంతో ఆమె మెడ భాగం నుజ్జునుజ్జయి, చూడటానికి వీలులేకుండా మారింది. మిషన్ యజమాని వెంటనే మిషన్ ఆఫ్ చేశాడు. అప్పటికే ఆమె మృతిచెందింది. తాడిమర్రి పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. అల్లుడు చనిపోయి 9 రోజులు తిరక్కుండానే.. రమీజా మృతిచెందడంతో ఆ ఇంట్లో విషాదం అలుముకుంది. అనారోగ్యంతో ఉన్న భర్త, బుద్ధిమాంద్యం కుమారుడు, భర్తను పోగొట్టుకున్న కుమార్తె, ఆమె పిల్లలు దిక్కులేనివారయ్యారు. వరుస ఘటనలతో వారి కుటుంబం ఛిద్రమైంది. ఆ పేద కుటుంబానికి దేవుడు ఎందుకింత తిప్పలు పెడుతున్నాడోనని స్థానికులే కన్నీటి పర్యంతమయ్యారు.

నర్సింగ్ విద్యార్థులకు జపాన్‌లో ఉద్యోగావకాశాలు

పుట్టపర్తి రూరల్, మార్చి 7: జిల్లాలో నర్సింగ్ విద్యార్థులకు జపాన్‌లో నర్సులుగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్‌ఖయ్యూమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జపాన్ దేశంలో నర్సింగ్ ఉద్యోగావకాశాలకు సంబంధించి శిక్షణ కాలం ఆరునెలలు ఉందన్నారు. ఈ శిక్షణ బెంగుళూరులో నిర్వహిస్తున్నారన్నారు. శిక్షణ ఫీజు రూ. 3,50,000లని తెలిపారు. పాక్షిక రుసుం రూ. 50వేలు కాగా .. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రూ. 25వేలు చెల్లిస్తుందని, మిగిలిన రూ. 25వేలు అభ్యర్థి చెల్లించాలని చెప్పారు. మిగిలిన రూ. 3లక్షలు విడతలవారీగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగం పొందిన అభ్యర్థికి జీతభత్యాలు రూ.లక్షా పదివేల నుంచి రూ. లక్షానలభై వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు 9398643930కు సంప్రదించాలన్నారు. www.apssdc.in లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం

● జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

పుట్టపర్తి, మార్చి 7: ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కలిగించడం జరిగిందని, సద్వినియోగం చేసుకోవాలంటూ జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం ఆయన అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు ఎన్నికలు సజావుగా సాగేందుకు అధికారులు సంసిద్ధం కావాలన్నారు. అంతకు ముందు జేసీ మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ భాగ్యరేఖ, వంశీకృష్ణ, వెంకటశివసాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు సామగ్రి పరిశీలన

పుట్టపర్తి రూరల్, మార్చి 7

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బందోబస్తుకు పోలీసు సిబ్బంది ఉపయోగించే సామగ్రిని ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసుకార్యాలయంలో గురువారం ఆయన హెల్మెట్‌స్టోన్ గార్డు, లాఠీలు, మెగాఫోన్, లైట్ బాడీ ప్రొటెక్టర్, వంటి సామగ్రిని పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తినప్పుడు పోలీసులు వాటిని ఏవిధంగా ఉపయోగించాలో తెలియజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఆర్ఐలు రవికుమార్, వలి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



గజవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

గజవాహనంపై ఊరేగిన కాశీవిశ్వేశ్వరుడు

అనంతపురం కల్చరల్, మార్చి 7: స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజున శుక్రవారం రాత్రి స్వామీ అమ్మవార్లను గజవాహనంపై ఊరేగించారు. ప్రజాపిత ఈశ్వరీయ బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 10 అడుగుల శివలింగంతో నగరంలో శోభాయాత్ర నిర్వహించారు.

కోనక్షేత్రంలో శివరాత్రి ఉత్సవాలు



చెన్నేకొత్తపల్లి, మార్చి 7: మండల కేంద్రానికి సమీపంలోని కోన కన్వాశ్ర మంలో శుక్ర, శనివారాల్లో శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీమల్లికార్జున స్వామి కన్వాశ్రమం ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం గోపూజ, ధ్వజారోహణం, జలాభిషేకం పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. సాయంత్రం టింబక్టు విద్యార్థుల చెక్కభజన, కోలాటం, గుడిపల్లి రంగనాథస్వామి భక్తమండలి పాండురంగ భజనలు ఉంటాయన్నారు. రాత్రి 12 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, అనంతరం ఉత్సవ మూర్తుల ఊరేగింపు ఉంటుందన్నారు. శనివారం దేవాంగ సంఘం అన్నసమారాధనతో ఈ ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

బండారు శ్రావణిశ్రీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం

శింగనమల, మార్చి 7: శింగనమల టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తరిమెల టీడీపీ నాయకులు అన్నారు. గురువారం తరిమెల గ్రామంలో టీడీపీ నాయకుడు పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ టీడీపీ నాయకలు కార్యకర్తలు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. 2024లో ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తన టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు





రెవెన్యూ భవన్‌లో మహిళా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న కలెక్టరు గౌతమి, సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌ఎల్ సీనియర్ సివిల్ జడ్జి జీ దీనా

కలెక్టరేట్‌లో మహిళా దినోత్సవం

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏపీ అమరావతి జేఏసీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ.. జిల్లాలో మాహిళా ఉద్యోగులకు ఏమైనా సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నగరంలోని కేఎస్‌ఎన్ డిగ్రీ కళాశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ గౌతమి పాల్గొన్నారు. అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో చైర్మన్ అనంతరాముడు అడ్వకేట్ పద్మజను సత్కరించారు. అనంతపురంలోని లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ హాలులో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఏఆర్‌ఎల్ సీనియర్ సివిల్ జడ్జీ జీ దీనా పాల్గొన్నారు. స్థానిక బాలాజీ కళ్యాణ మండపంలో రాయలసీమ బలిజ మహాసంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో 700 మందికి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఇందులో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పద్మజ, రాయలసీమ బలిజ మహాసంఘం అధ్యక్షుడు శంకరయ్య, గౌరవాధ్యక్షుడు పాముదాయి వెంకటేష్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఆర్‌బి దేవి, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని పాల్గొన్నారు. కియా ఇండియా మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలో నగరంలోని రెయిన్‌బో క్రీసెంట్ అనాథాశ్రమంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జేఎన్‌టీయూ ఎన్‌టీఆర్ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో వీసీ శ్రీనివాసరావు, శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ లర్నింగ్ డైరెక్టర్ శ్రీవిద్య హాజరయ్యారు.

ఆర్టీసీ బస్టాండ్ కిటకిట

అనంతపురం కల్చరల్, మార్చి 7: ప్రయాణికుల రద్దీతో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం, రెండో శనివారం, ఆదివారాలు వరుస సెలవులు రావడంతో విద్యార్థులు, ఉద్యోగులు తమ కుటుంబంతో కలిసి శుక్రవారమే సొంతూళ్ల బాట పట్టారు. కాగా కర్నూలు నుంచి శ్రీశైలం వెళ్లేలా అనంతపురం రీజియన్ నుంచి 55 బస్సులను కేటాయించడంతో పలు రూట్లకు బస్సు సర్వీసులు రద్దయ్యాయి. ఈ కారణంగా ప్రయాణికులకు నిరీక్షణ తప్పలేదు. బస్సులు బస్టాండులోకి ప్రవేశించగానే సీట్ల కోసం పోటీపడ్డారు. బస్సుల్లో సీట్లు లేకపోయినా ప్రయాణికులు నిలబడే తమ ప్రయాణాలను సాగించారు.



బస్సు రాగానే సీట్ల కోసం పోటీ పడుతున్న ప్రయాణికులు



పూజలో పాల్గొన్న విద్యార్థులు, టీచర్లు

ఎస్ఆర్‌కే స్కూల్‌లో ఘనంగా సరస్వతిపూజ

అనంతపురం విద్య : నగర శివారు రుద్రం పేటలోని శ్రీరామకృష్ణ విద్యాలయం (ఎస్ఆర్‌కే హైస్కూల్)లో పదో తరగతి విద్యార్థులు గురువారం సరస్వతి పూజ నిర్వహించారు. డైరెక్టర్ రమేష్ కుమార్, కరస్పాండెంట్ సునీత ఆధ్వర్యంలో ఈ పూజ వైభవంగా చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

టెన్త్ విద్యార్థి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, మార్చి 7: మండలంలోని ఎర్రజిన్నన్నగారిపల్లిలో బొగ్గు సిద్దప్ప కుమారుడు అభిషేక్ (16) గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అభిషేక్ చెన్నేకొత్తపల్లిలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. తన గది నుంచి ఎంతసేపైనా అభిషేక్ బయటకు రాకపోవడంతో గురువారం సాయంత్రం అతని తల్లిదండ్రులు అనుమానం వచ్చి వెళ్లి చూశారు. ఉరికి వేలాడుతుండటాన్ని గమనించి.. వెంటనే కిందకు దించి చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అతను మరణించినట్లు తెలిపారు. కాగా పదో తరగతి పరీక్షలను పురస్కరించుకుని బుధవారం పాఠశాలలో నిర్వహించిన సరస్వతి పూజలో కూడా తోటి విద్యార్థులతో కలిసి అభిషేక్ పాల్గొన్నాడు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వా స్పత్రికి తరలించామని, ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా తిరుప్పావడ సేవ



అనంతపురం కల్చరల్, మార్చి 7: మాఘశుద్ధ ద్వాదశిని పురస్కరించుకుని తపోవనంలోని శ్రీక్షేత్రంలో గురువారం తిరుప్పావడసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నవకలశ స్థాపన, వెంకటేశ్వరస్వామికి ఫలపంచామృతాభిషేకాలు, కలశాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణంలో తిరుప్పావడ సేవతో స్వామివారికి మహానైవేద్యం సమర్పించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో వడిగేపల్లి నరసింహాచార్యులు, మణూరు నాగరాజారావు, నరసింహ, భక్తులు పాల్గొన్నారు.

దళితుల గుడిసెల దహనంపై కేసు

రాప్తాడు : ప్రసన్నాయపల్లిలో దళితుల గుడిసెల దహనం సంఘటనలో కొందరిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపా రు. ప్రసన్నాయపల్లిలో ప్రభుత్వ భూమిలో దళితుల వేసుకున్న గుడిసెలకు బుధవారం రాత్రి ప్రేమ్‌కుమార్, రామాంజినేయులు, మరికొందరు నిప్పు పెట్టారని, అడ్డువచ్చిన వారిపై దాడి చేశారని జై బీమ్ పార్టీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు.

దమ్ముంటే రాజకీయంగా ఢీ కొట్టండి

వైసీపీ నేతలకు జనసేన నేత పొదిలి బాబురావు సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న పొదిలి బాబురావు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 7: దమ్ముంటే రాజకీయంగా ఢీ కొట్టండి... అంతేగానీ చేతగాని దద్దమ్మల్లా వ్యవహరించొద్దంటూ జనసేన పార్టీ నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు. గురువారం మంగళగిరిలోని జనసేన సిబ్బంది అపార్ట్‌మెంట్‌లో పోలీసుల తనిఖీలను ఆయన ఖండించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందని, అందులో భాగంగానే ఇలా ఇతర పార్టీ నేతలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పోలీసులు వైసీపీకి తొత్తులుగా మారి ఎలాంటి ఆధారాల్లేకుండా తనిఖీల పేరుతో అక్కడున్న సిబ్బందిని భయాభ్రాంతులకు గురిచేశారన్నారు. జనసేన, టీడీపీకి జనాల్లో వస్తున్న ఆదరణతో తమ తమ పనైపోయిందని గ్రహించిన వైసీపీ నాయకులు ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. చట్టానికి లోబడి పనిచేయాల్సిన పోలీసులు ఇప్పటికైనా తమ బాధ్యతలను గుర్తెరిగి వ్యవహరించాలన్నారు. అప్పుడైనా ప్రజల్లో పోలీసులకు కాస్తోకూస్తో గౌరవం దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రజలు వైసీపీ అక్రమాలు, దౌర్జన్యాలను నిశితంగా పరిశీలిస్తున్నారని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటుతో సరైన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ సమావేశంలో నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, రొళ్ల భాస్కర్, హుస్సేన్, దరాజ్ బాష, నగర కార్యదర్శులు అంజి, ఆకుల అశోక్, వీర మహిళలు అనసూయ, దాసరి సరిత, నాయకులు హిద్దూ, విజయ్ రాయల్, హరి, వినయ్ పాల్గొన్నారు.

తాడేపల్లి ప్యాలెస్ తొత్తుల్లా పోలీసులు : వరుణ్ ధ్వజం

చట్టానికి లోబడి పనిచేయాల్సిన పోలీసులు.. తాడేపల్లి ప్యాలెస్ తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, వారు భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ గురువారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. జనసేన, టీడీపీ కూటమిని రాజకీయంగా ఎదుర్కోలేకనే వైసీపీ నాయకులు ఇలా కక్ష సాధింపులకు పాల్పడున్నారన్నారు. మంగళగిరిలో జనసేన సిబ్బంది నివసించే అపార్ట్‌మెంట్లకు వెళ్లిన పోలీసులు భయభ్రాంతులకు గురిచేసే విధంగా తనిఖీ చేయడం, దురుసుగా ప్రవర్తించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిదన్నారు. జగన్మోహన్‌రెడ్డి తాటాకు చప్పుళ్లకు జనసైనికులు భయపడే ప్రసక్తే లేదన్నారు. వైసీపీ కండువా కప్పుకున్నట్టుగా వ్యవహరిస్తున్న పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో న్యాయ స్థానాలను ఆశ్రయిస్తామని వరుణ్ ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

కొత్తగేరిలో టీడీపీ ఇంటింటి ప్రచారం



కొత్తగేరిలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రామగిరి : మండలంలోని నసనకోట పంచాయతీ కొత్తగేరి గ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటిపై నాయకులు, కార్యకర్తలు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రామ్మూర్తి నాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షుడు శ్రీధర్ నాయుడు, మాదాపురం శంకర, ఎస్సీ సెల్ నియోజకవర్గ కార్యదర్శి పోత న్న, ఎంపీటీసీ శ్రీనివాసులు, వెంకటరాముడు, సురేశ్, ముత్యాలు పాల్గొన్నారు.

నేడు కొత్తపల్లిలో... (రాప్తాడు) : మండలంలోని కొత్తపల్లిలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీత పాల్గొంటారన్నారు. కొత్తపల్లి మాజీ సర్పంచులు, బుక్కచెర్ల సొసైటీ సింగల్ విండో మాజీ అధ్యక్షుడు, సర్పంచ్ అభ్యర్థి, యువకులు మొత్తం 40 కుటుంబాలు టీడీపీలో చేరతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

గార్లదిన్నె, మార్చి 7: మండలంలోని ముంటిడుగు గ్రామంలో శింగనమల నియోజకవర్గం టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి సుమారు రూ. 35 లక్షలతో శివాలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. గురువారం ఆ ఆలయంలో వినాయక, నంది, నవగ్రహాల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో బుధవారం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్న సంతర్పణ చేశారు. ముంటిమడుగు సోదరులు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముంటిమడుగు శ్రీకాంత్‌రెడ్డి, కేశవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గేటుక్రిష్ణారెడ్డి, గుర్రం శీనా, రామాంజినేయులు, నాగేష్, అంజినేయులు, గంగాధర్, నారపరెడ్డి పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న ముంటిమడుగు కేశవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

నారా భువనేశ్వరిని కలిసిన పెండ్యాల శ్రీలత



అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 7: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా జిల్లాకు వచ్చిన నారా భువనేశ్వరిని జనసేన పార్టీ రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం బళ్లారి బైపాస్ సమీపంలో నారా భువనేశ్వరి బస చేసిన కేంద్రానికి వెళ్లిన పెండ్యాల శ్రీలత ఆమెకు పుష్పగుచ్చాలు అందజేశారు.

జగన్ కనుసన్నల్లో పోలీస్ వ్యవస్థ : రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ జగన్‌రెడ్డి కనుసన్నల్లో నడుస్తోందని, వైసీపీకి బీ టీమ్‌గా వ్యవహరిస్తోందని పెండ్యాల శ్రీలత మండిపడ్డారు. నగరంలోని 27వ డివిజన్‌లో గురువారం మహిళలతో మాటామంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... బుధవారం అర్ధరాత్రి జనసేన పార్టీ మంగళగిరి కేంద్ర కార్యాయలంలో పవన్‌కళ్యాణ్ వ్యక్తిగత సిబ్బంది నివసించే గదుల్లోకి వెళ్లి అక్కడ ఉన్న వాచ్‌మెన్‌ను పోలీసులు గన్నుతో బెదిరించి భయభ్రాంతులకు గురిచేశారన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా గదుల్లో తనిఖీలు చేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామా... లేక నియంత పాలనలో ఉన్నామా అన్న అనుమానం కలుగుతోందన్నారు. వైసీపీ నాయకులకు కొమ్ముకాస్తూ వారు చెప్పినట్లు వ్యవహరించడం ఎంత వరకూ సమంజసమో పోలీసు యంత్రాంగం ఆలోచించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ డివిజన్ నాయకుడు తాతయ్య, నగర ప్రధాన కార్యదర్శి పెండ్యాల చక్రపాణి, వీర మహిళలు పాల్గొన్నారు.



ఆలంను సన్మానిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

ఆలంకు సన్మానం

అనంతపురం అర్బన్ : టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన ఆలం నరసానాయుడిని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం అనంతపురం నగరంలోని ఆయన నివాసం వద్ద టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుత్తా ధనుంజయనాయుడు, నాయకులు నరేష్, శివకుమార్, రవి, తెలుగు యువత నాయకులు అనిల్‌కుమార్ ఆలంకు శుభాకాంక్షలు తెలిపారు.

బీసీలపై జగన్ పెత్తనాన్ని సహించం

అనంతపురం క్లాక్‌టవర్ : బీసీల ఓట్లతో గద్దెనెక్కిన జగన్ బీసీలపైనే పెత్తనం చెలాయిస్తే సహించేది లేదని బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు డికె రామలింగం హెచ్చరించారు. గురువారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ ఐక్యవేదిక నాయకులు అశ్వర్థ, ఎర్రిస్వామి, తరంగసాయి పాల్గొన్నారు.

ఏపీఎంఐపీ పీడీ బాధ్యతల స్వీకరణ

అనంతపురం అర్బన్ : ఏపీఎంఐపీ పీడీగా రఘునాథ్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఏపీడీ ఫిరోజ్ ఖాన్, సూపరింటెండెంట్ ప్రసాద్, ఇతర అధికారులు, సిబ్బంది , డ్రిప్ కంపెనీల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యానశాఖ ఇన్‌చార్జి జిల్లా అధికారిగా నరసింహారావు : ఉద్యానశాఖ ఇన్‌చార్జి జిల్లా అధికారిగా నరసింహారావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసే రఘునాథ్‌రెడ్డి ఏపీఎంఐపీ పీడీగా బదిలీ అయ్యారు. ఈ నేపథ్యం లో ఉద్యాన శాఖ కమీషనరేట్‌లో పనిచేస్తున్న డీడీ ఆండాలుకు ఉద్యానశాఖ జిల్లా అధికారిగా బదిలీ చేశారు. ఆమె గురువారం జిల్లాకు చేరుకొని బాధ్యత లు స్వీకరించి, ఓడీపై తిరిగి కమీషనరేట్‌కు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఉద్యాన ఏడీ నరసింహారావుకు ఉద్యానశాఖ జిల్లా అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

అభివృద్ధి అంటే మంచినీళ్లు కూడా ఇవ్వకపోవడమా?: సీపీఐ

అనంతపురం విద్య: నగరంలో రూ. వెయి కోట్లకుపైగానే అభివృద్ధి పనులు చేశామని అనంతపురం ఎమ్మెల్యే చెప్పకుంటున్నారని... అయితే ఇటీవల 20 రోజులకుపైగా మంచినీళ్లు కూడా ఇవ్వలేని దుస్థితి ఎదుర్కొన్నామని, ఇదేనా అభివృద్ధి అంటే.. అని సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు ఎమ్మెల్యేను ప్రశ్నించారు. గురువారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ సమస్య మరింత జఠిలంగా మారిందని, అయినా అధికార పార్టీ నేతల్లో స్పందన లేదని అన్నారు. నగరంలోని కోట్ల విలువైన స్థలాలను కబ్జా చేస్తున్నా... అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శులు అల్లిపీరా, రమణ పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేయండి

అనంతపురం టౌన్ కలెక్టరేట్‌లో ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎన్నికల ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి కంట్రోల్ రూమ్. మీడియా సెల్, వెబ్‌కాస్టింగ్, కంప్లైంట్ సెల్ తదితర ఏర్పాట్లను వేగంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, అడిషనల్ ఎస్పీ విజయ భాస్కరరెడ్డి, అధికారులు ఉమామహేశ్వరమ్మ, రవిశంకర్, ప్రభాకరరెడ్డి. కలెక్టరేట్ ఏఓ అంజన్‌బాబు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రవికుమార్ , పలువురు అధికారులు పాల్గొన్నారు.

11న ఇంటర్వ్యూలు

అనంతపురం సెంట్రల్: ఎస్కేయూలో అకడమిక్ కన్సల్టెంట్స్ ఇంటర్వ్యూలను సోమ వారం నిర్వహిస్తున్నట్లు పీర్వీ ప్రొఫెసర్ రామ గోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గణితశాస్త్ర బోధకులుగా అర్హులైన అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్స్‌తో మ్యాథమేటిక్స్ విభాగంలో హాజరుకావాలని సూచించారు.

పార్కు స్థలం కబ్జా

అనంతపురంరూరల్ : మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీ ఐజీ నగర్ వద్దగల పార్కు స్థలానికి కొంత మంది అధికార పార్టీ నాయకులు కంచె వేశారు. గురువారం ఉదయం నుంచి నాయకులు ఈ పనులను ప్రారంభించినట్లు సమాచారం. కక్కలపల్లి సర్వే నెంబరు 21 లో 40సెంట్లు పంచాయతీ స్థలం ఉంది. అధికార పార్టీ నాయకులు చేజిక్కించు కునేందుకు ఆ స్థలానికి పెన్సింగ్ వేస్తున్నట్లు తెలుస్తోంది. ఉదయం నుంచి ఈ వ్యవహారం జరుగుతున్నా.. పంచాయతీ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

వైసీపీ నేతపై చర్యలు తీసుకోండి

బుక్కరాయసముద్రం, మార్చి7: బుక్కరాయ సముద్రం గ్రామ పంచాయతీలోని హమాలీ కాలనీలో ఎరికల బాలప్పకు చెందిన స్థలాన్ని దౌర్జన్యంగా వైసీపీ నేత శేషానందారెడ్డి ఆక్రమించారని, వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని అనంతపురం డీఆర్వో రామక్రిష్ణారెడ్డికు టీడీపీ, టీఎన్ఎస్ఎఫ్ నేతలు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు వెంకటప్ప, గిరిజన సంఘాల నేతలు, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్ప, మాజీ డీపీఎంసీ సభ్యుడు తిరుపాలు, వెంకటేష్, శివరామరాజు పాల్గొన్నారు.

వైభవంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ

ఆత్మకూరు : స్థానిక ప్రధాన సర్కిల్ సమీపంలో గురువారం వాల్మీకి కాస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మూడు రోజులుగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లాలోని వాల్మీకి సంఘం నాయకులు ఇందులో పాల్గొన్నారు. అనంతపురంలోని అమరావతి ఆసుపత్రి ఎండీ ముత్యాలు రూ. రెండు లక్షలు, ప్రొఫెసర్ రాజేష్ రూ. రెండు లక్షలు విరాళంగా అందజేశారు.

కొనసాగుతున్న యువచైతన్య బస్సుయాత్ర



జేసీపీఆర్‌కు పూలతో స్వాగతం పలుకుతున్న అక్కన్నపల్లి గ్రామస్థులు

తాడిపత్రిటౌన్, మార్చి7: మండలంలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి చేపట్టిన యువచైతన్య బస్సుయాత్ర గురువారం కూడా కొనసాగింది. మండలంలోని అక్కన్నపల్లి, హుస్సేనాపురం, వీరాపురం, బొందలదిన్నె, వంగనూరు, జంబులపాడు, కొండేపల్లి, చల్లవారిపల్లి, గన్నెవారిపల్లి గ్రామాల్లో ఆయన బస్సుయాత్ర సాగింది. ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ప్రతి గ్రామంలో మహిళలు పెద్దఎత్తున జేసీపీఆర్‌కు హారతులు పట్టి స్వాగతం పలికారు. అనంతరం ప్రతి ఒక్కరిని పేరుపేరునా పలకరిస్తూ వారి యోగక్షేమాలను జేసీపీఆర్ అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోతో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ, వెంకటనాయుడు, ప్రభాకర్‌నాయుడు, మండల కన్వీనర్ నరేంద్రనాయుడు, చల్లా సూరి, సోమశేఖర్‌నాయుడు, రమణ, ప్రసాద్, రవి, పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు



తాడిపత్రిలో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

ఉరవకొండ, మార్చి 7: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో గురువారం బీఎస్ఎఫ్ బలగాలు కవాతు నిర్వహించాయి. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి టవర్ క్లాక్ వరకూ కవాతు చేపట్టారు. నియోజక వర్గానికి 95 మంది సిబ్బంది కేటాయించారని సీఐలు సురేష్, ప్రవీణ్ కుమార్ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

తాడిపత్రిటౌన్: ఎన్నికల దృష్ట్యా పట్టణంలో గురువారం పోలీసులు కవాతు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారి సీబీరోడ్డు, గాంధీసర్కిల్, యల్లనూరురోడ్డు, బస్టాండ్‌సర్కిల్ మీదుగా కవాతు జరిగింది. డీఎస్పీ గంగయ్య మాట్లాడుతూ ప్రజలు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవచ్చునన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుగుతాయని ఎవరూ భయపడాల్సిన పనిలేదని తెలిపారు. కవాతులో సీఐలు మురళీకృష్ణ, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్ఐలు రామకృష్ణ, గౌస్‌బాషా, సాగర్, ఏఎస్ఐలు, బీఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

ఆర్థికసాయం అందజేత

ఉరవకొండ, మార్చి 7: పట్టణంలోని పలు కుటుంబాలకు టీడీపీ నాయకులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. స్థానిక 7 వార్డుకు చెందిన రమేష్, మల్లేష్ విద్యుత్ షాక్ గురై మృతి చెందారు. ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో టీడీపీ నాయకులు స్పందించి రూ.10 వేలను అందించారు. అలాగే అంబేడ్కర్ నగర్‌కు చెందిన సాకే ఆనంద్, నారాయణస్వామిలతో పాటు మరో ఎనిమిది కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, ప్యారం కేశవానంద, వరప్రసాద్, కౌకుంట్ల రవి, వెంకటేశులు, మాసినేని రమేష్, బాబు పాల్గొన్నారు.

న్యాయవాదులకు వైద్య పరీక్షలు

గుత్తి, మార్చి 7: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో ఉన్న బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం కర్నూలు కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి కాశీవిశ్వనాథచారి, జూనియర్ సివిల్ న్యాయాధికారి కీర్తి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం న్యాయవాదుల కుటుంబసభ్యులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌బాబు, చంద్రశేఖర్, న్యాయవాదులు సోమశేఖర్, నూర్‌మహ్మద్, రసూల్, శ్రీధర్ పాల్గొన్నారు.

జీతాల్లేవు.. అంబులెన్స్ లేదు.. ఇలా ఉంటే ఎలా?

రాయదుర్గం, మార్చి 7: వైద్యశాలలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు మూడునెలలుగా జీతాలు ఇవ్వకుండా, రోగుల కోసం ఏర్పాటు చేసిన అంబులెన్స్ కూడా లేకుండా ఉంటే వైద్యం ఎలా అందుతుందని ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి వైద్యులను ప్రశ్నించారు. గురువారం ప్రభుత్వ వైద్యశాలలో అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. రికార్డులను పరిశీలించి వైద్యశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికులు రోజూ పనిచేస్తున్న వారికి మూడు నెలలుగా జీతం ఇవ్వలేదని ఆయనకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఉన్నతాధికారులకు ఫోన్ చేసి వేతనాలు చెల్లించాలని ఆదేశించారు.

11 నుంచి సమ్మెలోకి శ్రీరామిరెడ్డి కార్మికులు

కళ్యాణదుర్గం, మార్చి 7: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు ఐదు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదని, ఇందుకు నిరసనగా 11వ తేదీ నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు కార్మికులు తెలిపారు. గురువారం ఎస్ఈ కార్యాలయంలో సమ్మె నోటీసును డీఈ శ్రీనివాసులుకు అందచేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 138 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. ఐదు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోతే మా కుటుంబాలు ఎలా పోషించుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె నోటీసుకు అధికారులు స్పందించి జీతాలు మంజూరు చేయాలని, లేని పక్షంలో సమ్మెలోకి వెళతామని ప్రకటించారు.

కాంగ్రెస్ పార్టీలోకి మధుసూదన్ రెడ్డి

ఉరవకొండ, మార్చి 7: మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళగిరిలో జరిగిన న్యాయ సాధన ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. షర్మిల ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాజన్న పాలన రావాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు.

నరమృగ వాహనంపై బుగ్గ రామలింగేశ్వరుడు



తాడిపత్రిటౌన్, మార్చి 7: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు నరమృగ వాహనంపై ఊరేగారు. స్వామివారి ఉత్సవ మూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మంగళవాయిద్యాల నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగించారు.

కమనీయం... శివపార్వతుల కల్యాణం

కళ్యాణదుర్గం, మార్చి 7: కం బదూరులో వెలసిన చోళుల కాలం నాటి శివాలయంలో శివపార్వతుల కల్యాణం కమనీయంగా సాగింది. వేద మంత్రోచ్చారణల మధ్య స్వా మి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శుక్రవారం ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా సాగనున్నాయి.

బెళుగుప్ప: మండల కేంద్రంలోని రామేశ్వరాలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు, దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారిని శోభారాణి తెలిపారు. శుక్రవారం ఉదయం పుణ్యాహవచనం, 7 నుంచి 8 గంటల వరకు పంచామృత అభిషేకాలు, రుద్రాభిషేకం, బిల్వార్చన, నైవేద్యం, మహామంగళహారతి, 12 గంటలకు స్వామివారి కల్యాణం, సాయంత్రం శివపార్వతులను పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్లు విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్రస్వామి

ఉరవకొండ, మార్చి 7: గవిమఠస్థిత చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లు గురువారం పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్రస్వామి విడుదల చేశారు. గవి మఠం ఏసీ చిట్టెమ్మ మాట్లాడుతూ ఈ నెల14 నుంచి 21వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంకణ ధారణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 15న నాగాభరణం, 16న నెమలి వాహనోత్సవం, 17న అడ్డ పల్లకీ ఉత్సవం, సాయంత్రం ఐరావత వాహనోత్సవం, 18న బసవేశ్వర వాహనోత్సవం, 19 మహా రథోత్సవం, 20న లంకాదహనం, 21 అశ్వ, వసంత వాహనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఆదోని చౌకి మఠం పీఠాధిపతి కల్యాణస్వామి, సిద్ధగంగ మఠం శాఖ చెన్నబసవస్వామి, సిబ్బంది నారాయణస్వామి, మధు, వెంకటేశులు పాల్గొన్నారు.



వృద్ధురాలితో సమస్యను అడిగి తెలుసుకుంటున్న అమిలినేని సురేంద్రబాబు



టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న అమిలినేని

అశేష జనవాహినితో అమిలినేని ఎన్నికల ప్రచారం

కళ్యాణదుర్గం, మార్చి 7: అశేష జనవాహిని మధ్య టీడీపీ ఎమ్మెల్యే అభ్య ర్థి అమిలినేని సురేంద్రబాబు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గురువారం శీబాయి గ్రామం నుంచి ఎన్నికల ప్రచారానికి ఆయన శ్రీకారం చుట్టారు. కార్యకర్తలు, నాయకులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. బాణసంచా కాలుస్తూ అడుగడుగునా పూలవర్షం కురిపించారు. ముందుగా గ్రామ దేవతకు పూజలు నిర్వహించి పార్టీ కార్యకర్తలు, నాయకుల మధ్య జెండాఊపి ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కొన్నిచోట్ల గ్రామస్థులు సమస్యలను విన్నవించుకున్నారు. సురేంద్రబాబు మాట్లాడుతూ తొలిరోజు ప్రచారానికి అనూహ్యస్పందన వచ్చిందన్నారు. అన్నిచోట్ల ప్రజలు టీడీపీపై అభిమానం చాటుతున్నారన్నారు. నియోజకవర్గంలోని 114 చెరువులకు రెండున్నరేళ్లలో కృష్ణాజలాలను మళ్లించడానికి కృషి చేసి, తన ప్రధానమైన హామీని నెరవేర్చుకుంటానని తెలిపారు. టీడీపీ, జనసేన ఉమ్మడి మెనిఫెస్టోను 100 శాతం అమలు చేస్తూ, నియోజకవర్గంలో తాను కూడా సొంతంగా మెనిఫెస్టోను తయారుచేసి ప్రజల ముందుకు తీసుకెళ్తానని అన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



వైసీపీ నాయకుడు ప్రతాప్‌రెడ్డిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న అమిలినేని

కళ్యాణదుర్గం, మార్చి 7: వైసీపీ నుంచి టీడీపీలోకి 20 కుటుంబాలు చేరాయి. గురువారం ప్రజావేదిక వద్ద టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. బ్రహ్మసముద్రం మండల ఎరడికెర గ్రామంలోని వైసీపీకి చెందిన 20 దళిత కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. మాజీ సర్పంచు చిన్న యల్లప్ప, కాటమ యల్లప్ప, వన్నూరప్ప, ధనుంజయ, వంశీ, రవి, హరీష్, లక్ష్మన్న, వెంకటరమణ, మంజు, రాయుడు, రాజు, వసంతలతో పాటు మరికొంత మంది పార్టీలోకి చేరారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్‌చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ, డీకే రామాంజనేయులు, మాజీ జడ్పీటీసీ కొల్లాపురప్ప, మాజీ ఎంపీపీ వన్నూరుస్వామి పాల్గొన్నారు.

కంబదూరులో..: వైసీపీకి బిగ్ షాక్: కంబదూరు మండల పరిధిలోని కదిరిదేవరపల్లిలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. గురువారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు ఆధ్వర్యంలో ఆ గ్రామ కీలక వైసీపీ నేత ప్రతాప్ రెడ్డి టీడీపీ పార్టీలోకి చేరారు. ఆయనకుపార్టీ కండువా కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయనతో పాటు మరో వైసీపీ కీలకనేత బోయ గంగాధర కూడా చేరారు.

తాడిపత్రిటౌన్: మండలంలోని వంగనూరు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ మద్దతుదారులు టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. జేసీపీఆర్ నిర్వహించిన యువచైతన్య బస్సుయాత్రలో వీరు పార్టీలో చేరారు. వారికి జేసీపీఆర్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ జేసీ అస్మిత్‌రెడ్డి గెలుపుకోసం తమవంతుగా శ్రమిస్తామని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో రామయల్లప్ప, రామచంద్రుడు, రాజేష్ ఉన్నారు.

ఉరవకొండ: మండలంలోని తట్రగల్లు గ్రామంలో వైసీపీకి చెందిన లోకేష్, బండయ్య, రాజేష్, టీడీపీలోకి చేరారు. ఎమ్మెల్యే తనయుడు విక్రమ్‌సింహ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. మండల కన్వీనర్ వెంకటేశులు, టీడీపీ నాయకులు సుధాకర్, దస్తగిరి, వన్నూరుస్వామి పాల్గొన్నారు.



తాడిపత్రిలో పార్టీలో చేరిన వారితో జేసీపీఆర్



ఉరవకొండలో పార్టీలో చేరిన వారితో విక్రమ్‌సింహ

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు



గ్రామస్థుడితో మాట్లాడుతున్న జేసీ అస్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి7: టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అస్మిత్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పడమటి గేరిలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీలో నెలకొన్న అండర్‌డ్రైనేజీ, మంచినీటి సమస్య గురించి మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. మున్సిపల్ వైస్‌చైర్మన్లు సరస్వతి, అబ్దుల్‌రహీం, టీడీపీ కౌన్సిలర్లు విజయ్ కుమార్, మల్లికార్జున, షెక్షావలి, జింకా లక్ష్మీదేవి, రేష్మాపర్వీన్, జ్యోతి, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని చేనేత కాలనీలో గురువారం జేసీ అస్మిత్‌రెడ్డి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మాజీ జడ్పీటీసీ చిరంజీవులు పాల్గొన్నారు.



కరపత్రాలను ప్రదర్శిస్తున్న మహిళలు, విజయ్‌సింహ

రానున్నది టీడీపీ ప్రభుత్వమే

ఉరవకొండ: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు విక్రమ్‌సింహ ధీమా వ్యక్తం చేశారు. వజ్రకరూరు మండలంలోని తట్రగల్లు గ్రామంలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను అందజేశారు. రానున్న ఎన్నికల్లో కేశవ్‌కు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. నూతేటి వెంకటేశులు, మాజీ ఎంపీపీ వెంకటమ్మ, మాజీ జడ్పీటీసీ తులసీదాస్, సుధాకర్, వలి, నాగేంద్ర, ఎర్రిస్వామి, అనంతయ్య, ధనుంజయ, వన్నూరప్ప, విజయ్ పాల్గొన్నారు. అలాగే విడపనకల్లు మండలంలోని డొనేకల్లు గ్రామంలో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేశవ్ తనయుడు విజయ్‌సింహ పాల్గొన్నారు. సూపర్‌సిక్స్ పథకాల వలన కలిగే లబ్ధిని ప్రజలకు వివరించారు. మిర్చి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల కన్వీనర్ మారయ్య, భీమలింగ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



గుంతకల్లులో టీచర్లను సన్మానిస్తున్న అధికారులు

గుంతకల్లుటౌన్, మార్చి7: స్థానిక దోనిముక్కల రోడ్డులోని ఎన్టీఆర్ మున్సిపల్ పాఠశాలలో గురువారం జేవీవీ ఆధ్వర్యంలో మహిళాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పురుషులతో పాటు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజాభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. అనంతరం మహిళా హెచ్‌ఎం, ఉపాధ్యాయినులను సన్మానించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్, వ్యవస్థాపక సభ్యులు గంగరాజు, జిల్లా అధ్యక్షుడు పీఎల్ రాధాక్రిష్ణ, లక్ష్మీప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు.

యాడికి: గ్రామీణ ప్రాంతాల్లో మహిళల పట్ల వివక్ష తగదని ఆర్డీటీ తాడిపత్రి ఏటీఎల్ రామాంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని కమలపాడు గ్రామంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళల పట్ల వివక్ష కొనసాగుతోందన్నారు. ఆర్డీటీ సిబ్బంది ఆంజనేయులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అనంతపురానికి చెందిన మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆతికనాజ్ పాల్గొన్నారు. అయన మాట్లాడుతూ తాను గొప్పగా ఎదగాలని మా అమ్మ ఎంతో శ్రమించిందని ఏమిచ్చి అమ్మ రుణం తీర్చుకోగలుగుతామన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, అధ్యాపకులు నాగమణి, వనిత పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన ధ్వజ స్తంభం

పామిడి, మార్చి 7: పట్టణంలోని నాగిరెడ్డికాలనీలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠను గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వివిధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం వేదపండితులు ప్రాతఃకాల పూజ, యంత్ర ప్రతిష్ఠ, ధ్వజప్రతిష్ఠ, హోమాలు, మహా పూర్ణాహుతి, మహా మంగళహారతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందించారు. మాజీ కౌన్సిలర్ వైయూ రామాంజనేయులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని రాయంపల్లి గ్రామంలో వెలసిన యాదవ ఇలవేల్పు చిత్రలింగేశ్వరస్వామి మహోత్సవంలో భాగంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం దేవాలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. స్వామివారికి ఉదయాన్నే అభిషేకం, పుష్పలంకరణ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేశారు.

తిమ్మప్పస్వామి ఆలయంలో: మండలంలోని కాశీపురం గ్రామంలో వెలసిన తిమ్మప్పస్వామి దేవాలయంలో తిమ్మప్పస్వామి, సీతారాముల నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి గంగపూజ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో తిమ్మప్పస్వామి, సీతారాముల నూతన విగ్రహ ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించారు.

శివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు



గుంతకల్లులోని బుగ్గసంగమేశ్వర ఆలయ ముఖద్వారం

గుంతకల్లుటౌన్, మార్చి 7: మండలంలోని బుగ్గసంగాల గ్రామంలో వెలసిన బుగ్గసంగమేశ్వరస్వామి ఆలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబైయింది. శుక్రవారం తెల్లవారుజాము 4 నుంచి స్వామివారికి పంచామృతాభిషేకాలు, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి 9గంటలకు భరతనాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 12 గంటలకు పార్వతీదేవి, బుగ్గసంగమేశ్వర స్వామి కల్యాణ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం ఉదయం స్వామివారికి అభిషేకం, మహామంగళహారతి, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం 4గంటలకు స్వామి వారి రథోత్సవం, ఆదివారం ఉదయం స్వామి వారి వసంతోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కృష్ణయ్య తెలిపారు. కసాపురంలోని నెట్టి కంటి ఆంజనేయస్వామి అనుబంధ దేవాలయమైన విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర ఆలయం, దోనిముక్కలలోని వీరుపాక్షేశ్వరస్వామి ఆలయం, పట్టణంలోని రాతిగుడి రామలింగేశ్వరస్వామి, పాతగుంతకల్లులోని రామలింగేశ్వర స్వామి, గుంతా రామలింగేశ్వర స్వామి, మార్కండేయస్వామి ఆలయంతో పాటు పలు శివాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కణేకల్లు: మహాశివరాత్రిని ఘనంగా నిర్వహించేందుకు మండల వ్యాప్తంగా ఆయా దేవాలయాల వద్ద నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలోని చిక్కణ్ణేశ్వర దేవాలయం, మాల్యం కళ్లేశ్వర స్వామి దేవాలయం, యర్రగుంట యణ్ణే రంగనాథస్వామి ఆలయాలతో పాటు పలు ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. శుక్రవారం భక్తాదులకు ప్రత్యేక దర్శనాన్ని కల్పించి తీర్థ ప్రసాదాలను అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పామిడి: శివరాత్రిని పురస్కరించుకొని పట్టణంలోని భోగేశ్వరాలయంలో శుక్రవారం స్వామి వారికి వేకువజామున నుంచే విశేష పూజలు నిర్వహిస్తారు. గణపతిపూజ, పుణ్యహవాచనం, మహాన్యాస పూర్వక ఏకాదశ, వార రుద్రాభిషేకాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల గుండా మంగళవాయిద్యాలతో వైభవంగా గ్రామోత్సవం నిర్వహిస్తారు.

భువనేశ్వరికి ఘన స్వాగతం



పామిడిలో నారా భువనేశ్వరికి మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలుకుతున్న దృశ్యం

పామిడి, మార్చి 7: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా గురువారం గుత్తికి వెళ్తుండడంతో పామిడిలో మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. గుంతకల్లు మాజీ శాసనసభ్యులు ఆర్ జితేంద్రగౌడ్ పుష్పగుచ్ఛం అందజేశారు. తెలుగుదేశం పార్టీ ఐక్యత వర్ధిల్లాలంటూ కార్యకర్తలు నినదించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుర్రం సుమిత్రమ్మ, పవన్ కుమార్ గౌడ్, రామాంజనేయులునాయక్, ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, అప్పన్నగారి కుమార్, మహమ్మద్ రఫీ, రామకృష్ణ, వడ్డే శివకుమార్, గీతా వెంకట్రామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, లక్ష్మన్న, జయకుమార్, రంగముని, రఫీ, మాబు, గురుస్వామి పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



స్థానికులపైకి దూసుకువచ్చిన పంట నూర్పిడి యంత్రం

యాడికి, మార్చి7: బ్రేకులు పనిచేయక పం ట నూర్పిడి యంత్రం స్థానికులపైకి దూసుకు వచ్చిన సంఘటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన గురువారం మండలకేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలమేరకు పాత పోలీస్‌స్టేషన్ సర్కిల్ వద్ద పంట నూర్పిడి యంత్రం మలుపు తిరిగే సమయంలో బ్రేకులు పడలేదన్నారు. స్థానికులపైకి యంత్రం దూసుకురావడంతో పరుగులు తీశారు. పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాల పైకి యంత్రం దూసుకురావడంతో కొన్ని ద్విచక్రవాహనాలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఈ సంఘటనలో ఎటువంటి ప్రాణాపాయం చోటుచేసుకోకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పొలం విషయమై ఘర్షణ... కత్తితో దాడి

గుంతకల్లుటౌన్, మార్చి 7: మండలంలోని పాతకొత్తచెరువు గ్రామంలో ఎం రవీంద్రపై పెద్దనాన్న కుమారుడు రైల్వే ఉద్యోగి గ్యాంగ్‌మేన్ మేస్త్రీ శివయ్య గురువారం సాయంత్రం కత్తితో దాడి చేశాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు రవీంద్ర తండ్రి చిన్నరామయ్యకు ఐదుగురు అన్నదమ్ములు. వీరి అమ్మ శాంతమ్మ పేరట 1.80 ఎకరాల పొలం ఉంది. శాంతమ్మ ఎనిమిది సంవత్సరాల క్రితం మృతి చెందింది. ఆ పొలం అన్నదమ్ములకు పంచాలని కోరారన్నారు. ఎనిమిది సంవత్సరాల నుంచి పొలం విషయమై పోలీసు స్టేషన్‌లో, గ్రామ పెద్దలతో పంచాయితీ జరిగిందన్నారు. సాయంత్రం గ్రామంలోని బస్టాండ్ వద్ద రవీంద్ర కూల్‌డ్రింక్ తాగుతుండగా శివయ్య అక్కడికి చేరుకొని అతనితో గొడవపడ్డాడన్నారు. దీంతో శివయ్య కత్తితీసుకుని రవీంద్ర కడుపులో పొడిచాడు. గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురానికి తరలించారు. గ్రామ శివారులోని పొలంలో శివయ్యను రవీంద్ర సోదరుడు సూరి, అతని బంధువు ముష్కినయ్య దాడి చేశారు. దాడిలో గాయపడిన అతన్ని రూరల్ పోలీసులు వాహనంలో చికిత్స నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

తాడిపత్రిటౌన్, మార్చి7: మండలంలోని బుగ్గ గ్రామ సమీపంలో గురువారం కారు ఢీకొన్న సంఘటనలో శివనారాయణరెడ్డి అనే వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలమేరకు నంద్యాలజిల్లా కొలిమిగుండ్ల మండలం బందార్లపల్లి గ్రామానికి చెందిన శివనారాయణరెడ్డి పనినిమిత్తం ద్విచక్రవాహనంలో తాడిపత్రికి వచ్చి తిరిగి వెళుతుండగా బుగ్గ సమీపంలో పెట్రోల్‌బంకు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతనిని కర్నూలుకు తరలించారు.

మట్కా రాస్తూ పట్టుబడిన మహిళ?

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 7: పట్టణంలో రెండు రోజుల క్రితం ఓ మహిళ మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఆ మహిళ నుంచి రూ.8,01,000 స్వాధీనం చేసుకుని పట్టణ స్టేషన్‌కు తరలించారని విశ్వసనీయ సమాచారం. అయితే స్టేషన్లో నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కనీసం మీడియాకు కూడా తెలియకుండా సదరు మహిళపై కూడా కేసు నమోదు చేయకుండా, విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నట్లు తెలిసింది. పోలీసులను అడిగితే విచారిస్తున్నామని దాటవేస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో నగదు పట్టుబడినా ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం కాని పరిస్థితి. చివరకు కేసు నమోదు చేస్తారా లేక మూసివేస్తారా లేక దాటవేస్తారా అన్నది తెలియడం లేదు.

వలంటీర్ నిర్మిస్తున్న అక్రమ కట్టడం నిలిపివేయండి

కణేకల్లు, మార్చి 7: మండలంలోని తుంబిగనూరు గ్రామంలో వలంటీర్ అక్కమ్మ, ఆమె మరిది దుగ్గెప్ప రహదారికి అడ్డంగా నిర్మిస్తున్న గృహ నిర్మాణం ఆపాలంటూ అధికారులు ఆదేశించారు. గ్రామంలోని సర్వేనెంబర్ 109బీ1లో ఉన్న స్థలం రహదారికి సంబంధించినది కాగా అందులో వలంటీరు అక్రమ కట్టడం నిర్మిస్తున్నారంటూ అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు, సురేష్, ముక్కన్న పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ కట్టడం నిర్మాణం ఆపాలని ఆదేశించారు. తహసీల్దార్ ఇంద్రరాణి, ఎంపీడీఓ గూడెన్న తదితరులు స్థలాన్ని పరిశీలించి అందులో ఎటువంటి కట్టడాలు చేయరాదని హెచ్చరించారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న టీడీపీ నాయకులు



టిప్పర్ నుంచి ఇసుకను అన్‌లోడ్ చేయిస్తున్న గ్రామస్థులు

పెద్దవడుగూరు, మార్చి7: మండలంలోని కొండూరు గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా వైసీపీ నాయకులు ఇసుకను టిప్పర్ల ద్వారా అక్రమంగా రవాణా చేస్తుండగా గ్రామస్థులు, టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. గురువారం గ్రామ సమీపంలోని పెన్నానది పరివాహక ప్రాంతంలో హిటాచీ ద్వారా టిప్పర్లలోకి ఇసుక లోడ్ చేసుకొని ఇతర ప్రాంతాలకు గ్రామం మీదుగా తరలిస్తుండడం గమనించిన గ్రామస్థులు, టీడీపీ నాయకులు సంఘటనా ప్రదేశానికి వెళ్లి అడ్డుకున్నారు. ఇసుకను తరలిస్తున్న వారు తమకు అనుమతులు ఉన్నాయని బుకాయించారు. టిప్పర్లలో నింపిన ఇసుకను కిందికి వేయించారు. అనుమతులపై టీడీపీ మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, మాజీ ఎంపీటీసీ మెంబరు లక్ష్మీనారాయణ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లగా ఇసుక తరలింపుకు ఎలాంటి అనుమతులు లేవని వారికి తెలిపారు.

పేదల భూముల్లో ఇళ్ల స్థలాలా?

● మండిపడ్డ సీపీఎం, దళిత సంఘాల నాయకులు

కూడేరు, మార్చి 7: మండల కేంద్రంలోని 535 సర్వేనంబర్‌లో పేదలు సాగు చేసుకున్న భూమిలో ఇళ్ల స్థలాలు కేటాయించడం ఏమిటిన సీపీఎం, దళిత సంఘాల నాయకులు మండిపడ్డారు. కూడేరు తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం బాధితులతో కలసి సీపీఎం నాయకులు కృష్ణమూర్తి, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ప్రధాన కార్యదర్శి సాకే హరి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ దళితుల భూముల్లో ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించడం తగదన్నారు. ఏళ్ల తరబడి దళితులు, మైనార్టీలు, పేదలు సాగు చేసుకున్న భూముల్లో కొందరు వైసీపీ నాయకులు, రెవెన్యూ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని వాటిని విరమించుకోవాలన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళనకారులతో చర్చించారు. కార్యక్రమంలో వెంకటేష్, వీరప్ప, కరీమ్, చితంబరమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.